
సాక్షి గుంటూరు

శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



కల్యాణ వేంకన్నకు అభిషేకం

దుగ్గిరాల:పసుపు యార్డు సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరాలయంలో శుక్రవారం స్వామికి అభిషేకం చేశారు. భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు: పొన్నూరు పట్టణ పరిధిలో శుక్రవారం అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వీరాంజనేయ స్వామి సేవలో ఎస్పీ



పొన్నూరు: పట్టణంలోని శ్రీ వీరాంజనేయస్వామిని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వీరా నాయక్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరమే ఆయుధం

ప్రజల గొంతు నొక్కడమే



అనునిత్యం యథార్థాలను ప్రజలకు అందిస్తున్న సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై కేసులు పెట్టడం ప్రజల గొంతు నొక్కడమే. ఇది దురుద్దేశపు కుట్ర. వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులను బెదిరించడం, వారిపై పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం ప్రజా స్వామ్యంపై ప్రత్యక్ష దాడి అవుతుంది. వాస్తవాలను బయటకు రాకుండా చేయాలనే ఏ ప్రయత్నమూ ఫలించదు. తక్షణమే సాక్షి ఎడిటర్‌పై, రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి. ప్రజా గొంతుకను నొక్కడం ఎవరి తరమూ కాదు. సత్యానికి ఎప్పుడూ మరణం లేదు.

– డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్,
వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త

కోర్టులు చీవాట్లు పెడుతున్నా మార్పేదీ?



కూటమి ప్రభుత్వం, పోలీసుల వైఖరిపై ఓ వైపు న్యాయస్థానాలు చీవాట్లు పెడుతున్నా తీరు మార్చుకోకుండా తప్పుడు కేసులు బనాయించడం ప్రజాస్వామ్యం కళ్లకు గంతలు కట్టడం కాదా? పోలీసుల ద్వారా కూటమి ప్రభుత్వం ఏకంగా సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు బనాయించడం వెనుక ఆంతర్యం అందరికీ తెలుసు. ప్రశ్నించే గొంతుకను నొక్కాలనుకోవడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజులే. ఎంత అణగదొక్కినా ఎగిసే కెరటంలా నిజాన్ని నిర్భయంగా చాటిచెప్పే సత్తాతో మీడియా ముందుకెళుతుంది. కూటమి ప్రభుత్వం కూడా ఇకనైనా కక్ష సాధింపులు మానుకోవాలి.

– వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు),
వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త

అక్రమ అరెస్ట్‌లతో అడ్డుకోలేరు !

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- ప్రజల పక్షాన పోరాటాలకు సిద్ధం

పట్నంబజారు: అక్రమ అరెస్ట్‌లు, గృహ నిర్బంధాలతో ప్రజల పక్షాన చేసే పోరాటాలను కూటమి ప్రభుత్వం అడ్డుకోలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు స్పష్టం చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పిడుగురాళ్లలో జరిగిన 'చలో మెడికల్ కాలేజ్' కార్యక్రమానికి పార్టీ యువజన, విద్యార్థి విభాగం నేతలు తరలి వెళ్లారు. బృందావన్ గార్డెన్స్‌లోని జిల్లా కార్యాలయం వద్ద ర్యాలీని పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా జెండా ఊపి ప్రారంభించారు.

అంబటి నివాసం వద్ద భారీగా పోలీసులు

ముందుగా అంబటి నివాసం వద్ద పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. ర్యాలీలకు అనుమతి లేదని, ఇందుకు సంబంధించి నోటీసులు తీసుకోవాలని పోలీసులు అడ్డుకున్నారు. అయితే, తాము ఎటువంటి ర్యాలీలు, నిరసన కార్యక్రమాలకు వెళ్లడం లేదని, తమ జిల్లా పార్టీ కార్యాలయం వద్దకు వెళ్తున్నామని రాంబాబు పోలీసులకు వివరించారు. జిల్లా పార్టీ కార్యాలయం వద్దకు వచ్చి నోటీసులు ఇస్తే తీసుకుంటామని చెప్పడంతో పోలీసులు అక్కడకు వచ్చి జారీ చేశారు.

ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వైద్య విద్య

ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మాణం చేసిన మెడికల్ కళాశాలలను కూటమి సర్కార్, చంద్రబాబు నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు అందాల్సిన వైద్యాన్ని, విద్యను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టే కుట్రలకు తెరదీశారని ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాలల నిర్మాణాలకు రూ. 5వేల కోట్లు లేవని చెబుతున్నారని, రూ. 52వేల కోట్లు అప్పు ఎక్కడ నుంచి తెచ్చారన్నారు. అమరావతికి అయితే ఎంతైనా నిధులు వస్తాయా ? అని ప్రశ్నించారు. చంద్రబాబు జ్ఞానం తెచ్చుకుని ఇప్పటికైనా ప్రైవేట్ పరం చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని హితవు పలికారు. పెట్టుబడి పెట్టిన వాడు వ్యాపారం చేస్తాడు తప్పా.. ఉచిత సేవ చేయడన్న విషయం తెలియదా ? అని ప్రశ్నించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో పేదలకు వైద్యం దక్కుతుందో లేదో అందరికీ తెలుసన్నారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అంబటి, నూరిఫాతిమా తదితరులు

పోలీసులను అడ్డుపెట్టుకుని కూటమి పాలన

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకుని ఎన్నాళ్లు పాలన చేస్తారని మండిపడ్డారు. నానాటికీ ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుంటూనే ఉన్నారని, ప్రజల పక్షాన ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్ట్‌లతో భయపెట్టాలని చూడటం సిగ్గుచేటని ఖండించారు. కేసులెన్ని పెట్టినా, బెదిరింపులకు గురి చేసినా వైఎస్సార్ సీపీ అడుగు కూడా వెనక్కి వేయదని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత కళ్లం హరికృష్ణారెడ్డి, నగర యువజన విభాగం అధ్యక్షుడు యేటి కోటేశ్వరరావు యాదవ్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడు శశిధర్, తూర్పు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు సుభాని, అనిల్‌రెడ్డి, విద్యార్థి విభాగం నేతలు భానుప్రకాష్, యువజన, విద్యార్థి విభాగం నేతలు పాల్గొన్నారు.

అంబటి ఇంటి వద్ద పోలీస్ బలగాలు



నగరంపాలెం: పోలీసులతో ప్రజా ఉద్యమాలను అణిచివేయాలని ప్రయత్నం చేసే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లోని ఆయన నివాసం వద్దకు శుక్రవారం మధ్యాహ్నం పట్టాభిపురం పోలీసులు, బలగాలు భారీగా చేరుకున్నారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్దకు వెళ్లేందుకు బయలుదేరిన అంబటి రాంబాబు, పార్టీ శ్రేణులను అడ్డుకున్నారు. ముగ్గురు ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది ఇంటి వద్దనే సాయంత్రం వరకు పహారా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మీడియాతో మాట్లాడుతూ సత్తెనపల్లి పోలీసులు అనేక మందిని నిర్బంధించారని, 12 మందిని అరెస్ట్ చేశారని తెలిపారు. వాస్తవంగా రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా ఈ ఉద్యమాన్ని చేయాలని భావించామని చెప్పారు. అయితే, గుంటూరులో తనను, చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజనీని, పల్నాడు జిల్లాలో యువజన విభాగం నేత శ్రీకాంత్‌ను అడ్డుకున్నారని వివరించారు. పోలీసుల ద్వారా ఉద్యమాలను అణిచివేయాలని చూడడం దురదృష్టకరమని ఖండించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించి డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో చంద్రబాబు, లోకేష్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, నాయకులు పఠాన్ సైదాఖాన్, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, నందేటి రాజేష్, న్యాయవాదులు రామకృష్ణారెడ్డి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

తురకపాలెం గ్రామంలో నీరు సురక్షితమే

గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కల్యాణ చక్రవర్తి

గుంటూరు రూరల్: తురకపాలెం నీటి పథకాల నుంచి సరఫరా చేస్తున్న తాగునీరు, బోరు బావుల నీరు సురక్షితమే అని లాబ్ పరీక్షలలో తేలిందని గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కల్యాణ చక్రవర్తి తెలిపారు. శుక్రవారం గ్రామంలో ప్రజల తాగునీరు, వాడుక నీరు పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాత ఆయన మాట్లాడారు. తురకపాలెంలో ఆరు బోరు బావులు, 90 వేల లీటర్లు, 40 వేల లీటర్ల సామర్థ్యం గల రెండు తాగునీటి పథకాలు ఉన్నాయన్నారు. 4.95 కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు వేసి నీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. గ్రామంలో 10 చేతి పంపులు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. వీటి నుంచి 16 నమూనాలు సేకరించి వాటర్ టెస్టింగ్ లాబ్‌కు రసాయన, బాక్టీరియా సంబంధిత విశ్లేషణకు పంపించామని తెలిపారు. లాబ్ నివేదికల ప్రకారం అన్ని అంశాలు నిర్ణీత పరిమితిలోనే ఉన్నాయని చెప్పారు. కోలి ఫామ్ బాక్టీరియా, ఇకోలి వంటి ఆనవాళ్లు లేవని తేలిందని ఆయన వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ లాబ్ కూడా తమ లాబ్‌లో చేసిన పరీక్షల మేరకు పథకాల నుంచి సరఫరా చేస్తున్న నీరు సురక్షితమే అని నిర్ధారించిందన్నారు.

ఏడు మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఏడు మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. అత్యధికంగా తుళ్లూరు మండలంలో 50.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా చేబ్రోలు మండలంలో 2.6 మి.మీ కురిసింది. సగటున 9.3 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. తాడికొండ మండలంలో 45.2 మి.మీ., ఫిరంగిపురం 33.6, వట్టిచెరుకూరు 18, పెదకాకాని 15.2, మేడికొండూరు మండలంలో 3.2 మి.మీ. చొప్పున పడింది.

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



మంగళగిరిటౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో ఈనెల 22వ తేదీ నుంచి జరగనున్న శ్రీదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల శుభ ఆహ్వానపత్రికను దేవస్థానంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆలయ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ పత్రాలను పరిగణలోకి తీసుకోరాదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఢిల్లీకి చెందిన విద్యాంజలి సంస్థ పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నకిలీ ఉపాధ్యాయ నియామక పత్రాలను పరిగణలోకి తీసుకోరాదని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర విద్యాశాఖ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం జరిపినట్లుగా ప్రచారం జరుగుతున్న ఫేక్ ధ్రువపత్రాలపై అప్రమత్తంగా ఉండాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, క్షేత్రస్థాయి విద్యాశాఖాధికారులకు సూచించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్‌తో పాటు డీఈవోల నుంచి ఎటువంటి నియామక పత్రాలు జారీ అవ్వలేదని స్పష్టం చేశారు. డీఎస్సీ–2025 ద్వారా ఉపాధ్యాయులుగా నియామకం పొందిన అభ్యర్థులకు ప్రభుత్వం త్వరలో అధికారికంగా తేదీని ప్రకటించి, నియామకపత్రాలు అందజేస్తుందని తెలిపారు. ఫేక్ నియామక పత్రాల ద్వారా నిరుద్యోగ అభ్యర్థులు మోసపోరాదని సూచించారు.

రాహుకేతు పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు



పెదకాకాని: శివాలయంలో రాహుకేతు గ్రహ పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ జీవీడీఎల్ లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 21వ తేదీన మహాలయ అమావాస్య ఆదివారం కావడంతో ఈ పూజలు చేయించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని శుక్రవారం ఆయన పేర్కొన్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని రాహుకేతు పూజా మండపం వద్ద షామియానాలు, క్యూలైన్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున 4 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ జరిగే ఈ పూజలకు ఆలయ ప్రధాన కౌంటర్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

గుంటూరు చానల్‌లో గల్లంతైన వ్యక్తి మృతి

కాజ(మంగళగిరి): గుంటూరు చానల్‌లో ప్రమాదవశాత్తూ పడి గల్లంతైన వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి దొడ్డక రాంబాబు(42) చానల్‌లో పడిన సంగతి తెలిసిందే. అతడి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం మృతదేహాన్ని వెలికి తీసి, ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. రాంబాబు భార్య ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తున్నారు. దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉచిత ప్రసాద వితరణకు విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఉచిత ప్రసాద వితరణ పథకానికి శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన గొట్టుముక్కల నాగమణి కుటుంబం రూ. 1,00116 విరాళం అందించింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

గుంటూరు ఐఆర్‌ఆర్ టెండర్ రద్దు

- ఫైనాన్సియల్ బిడ్‌కు నిరాకరణ
- ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ నిర్ణయం
- విజయవాడలోని మూడు రోడ్ల సంగతీ అంతే !
- అయినవారి కోసమే టెండర్లు రద్దా ?
- ముందే చెప్పిన 'సాక్షి'



టెండర్ల వాయిదాల పర్వం

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు పనుల టెండర్‌ను రద్దుచేస్తూ ఏపీసీఆర్‌డీఏ నిర్ణయం తీసుకుంది. అంతకు ముందు విజయవాడలోని మూడు రోడ్ల పనుల విషయంలోనూ ఇలాగే చేసింది. పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేసినప్పటికీ టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్లు సకాలంలో తెరవకుండా వాయిదాలు వేసింది కూడా. రోడ్ల పనులు పూర్తయితే తమకు నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు కొంతమేరకైనా తప్పుతాయని ఆశించిన గుంటూరు, విజయవాడ నగర వాసులకు నిరాశే మిగిలింది. రెండు నగరాల్లోని ప్రజాప్రతినిధులు తమ సొంత వ్యవహారాలను చక్కబెట్టుకునేందుకు నిత్యం ఆరాటపడుతున్నారే తప్పా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనను పట్టించుకోవడంలేదనే తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోటీపడిన కాంట్రాక్టర్లు

రాజధాని అమరావతి, గుంటూరు, విజయవాడ నగరాల్లో పది పనులు చేపట్టడానికి రూ.793.22 కోట్లతో జులై 11 నుంచి ఆగస్టు 8వ తేదీలోగా టెండరు డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఏపీసీఆర్‌డీఏ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆగస్టు ఒకటి నుంచి 13వ తేదీలోగా నిర్దేశిత బిడ్లకు టెండర్ల దాఖలుకు గడువిచ్చింది. గుంటూరులోని జేకేసీ కాలేజీ మార్గంలోని ఇన్నర్ రింగ్ రోడ్డు విస్తరణ, మిగిలిన పనులు, దెబ్బతిన్న రోడ్డు బాగు కోసం ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్నారు. స్వర్ణభారతీ నగర్ నుంచి పెద్దపలకలూరు వరకు మూడో దశ కింద రూ. 34,87,28,545తో ఆహ్వానించిన టెండరుకు ఆరుగురు కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. ఆగస్టు ఏడో తేదీ టెక్నికల్ బిడ్ తెరిచి ఈ మేరకు నిర్ధారించుకుంది. టెండరు నిబంధనల ప్రకారం మరుసటి రోజు (ఆగస్టు 8) ఫైనాన్షియల్ బిడ్ తెరవాలి. అయితే అలా చేయకపోగా వాయిదాలు వేస్తూ వచ్చింది. టెండరుదారులకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా సీఆర్‌డీఏ అధికారులు దాటవేత వైఖరిని అవలంబించారు.

రద్దు వెనుక మతలబు

ఏడీసీ, ఏపీసీఆర్‌డీఏల ఆధ్వర్యంలో ఆహ్వానిస్తున్న టెండర్లు కూటమి పార్టీ అధినేతల ఆశీస్సులు ఉన్న బడా కాంట్రాక్టర్లకు దక్కుతున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. ప్రస్తుతం రద్దుచేసిన టెండర్లన్నీ కలిపి బడా కాంట్రాక్టరుకు అప్పగించేందుకే అని టెండరుదారులు అభిప్రాయపడ్డారు. గుంటూరు, విజయవాడలో చేపట్టాల్సిన రోడ్డు పనుల విషయంలో టెండరు నిబంధనలను అనుసరించకుండా వాయిదా వేస్తున్న విషయాన్ని 'సాక్షి' ముందే చెప్పిన సంగతి తెలిసిందే.

తక్షణం ఈఎండీ చెల్లింపు

గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు టెండర్ పరిశీలన (బిడ్ ఎవాల్యువేషన్)ను పూర్తిచేసిన ఇంజనీరింగు విభాగం ఫైనాన్షియల్ బిడ్ తెరవడం కోసం ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్‌ను అనుమతి కోరగా శుక్రవారం రద్దు చేశారు. ఆరు టెండర్లు అర్హత పొందినా ఫైనాన్షియల్ బిడ్‌కు అనుమతించకపోవడంపై టెండరుదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారేమో అనే అనుమానాలతో ఈఎండీని సైతం వెనువెంటనే చెల్లించడం గమనార్హం. ఇదే విజయవాడకు సంబంధించిన మూడు టెండర్లను రద్దు చేసిన రెండు వారాల తరువాత ఈఎండీని సీఆర్‌డీఏ చెల్లించడం పరిశీలనాంశం.

నేటి నుంచి ఆన్‌లైన్ మొదటి దశ వెబ్ ఆప్షన్స్

గుంటూరు రూరల్: ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి బైపీసీ విభాగంలో బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీల్లో ప్రవేశాలకు మొదటి దశ ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ల నమోదుకు రంగం సిద్ధమైంది. ఈనెల 20నుంచి 22 వరకూ అభ్యర్థులు కళాశాలను ఎంచుకోవాలని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎం.వి. రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రెక్కల కష్టం.. వర్షార్పణం

- అన్నదాత ఆక్రందన
- ఖరీఫ్‌లో మూడుసార్లు మునిగిన పొలాలు
- శలపాడులో దెబ్బతిన్న పంట పొలాలు
- సాయం కోసం ఎదురుచూపు
- కోలుకోలేని విధంగా నష్టం



తుంగభద్ర డ్రెయిన్ పొంగి ప్రవహించడంతో నీట మునిగి చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

చేబ్రోలు: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలు ఆటుపోటులను ఎదుర్కొన్నారు. అతివృష్టితో అవస్థలు పడ్డారు. వర్షం నీటితో పొలాలన్నీ మునిగిపోయాయి. రైతుల కష్టం వర్షార్పణం మైంది.

చేబ్రోలు మండలంలోని శలపాడు, వీరనాయకుని పాలెం గ్రామాల పరిధిలో రైతుల అవస్థలు చూస్తే గుండె తరుక్కుపోతుంది. వందలాది ఎకరాల వరి పొలాలు వరద ముంపు బారిన పడ్డాయి. శుక్రవారం నాటికి కూడా ముంపు నుంచి బయటపడక పోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోవలసి రావటంతో ఆందోళన చెందుతున్నారు.

కన్నెత్తి చూడని నేతలు, అధికారులు

కష్టంలో ఆదుకోవాల్సిన అధికారులు, నాయకులు కన్నెత్తి కూడా చూడకపోవటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన రెండు నెలల్లో ఇప్పటి వరకు మూడు సార్లు వరి పొలాలు ముంపు బారిన పడ్డాయి. వరద తాకిడికి వరి పొలాలు కుళ్లిపోయాయి.

శాపంగా మారిన తుంగభద్ర డ్రెయిన్

చేబ్రోలు మండల పరిధిలోని శలపాడు, వీరనాయకునిపాలెం గ్రామాల మధ్యలో ఉన్న తుంగభద్ర డ్రెయిన్ రైతులకు శాపంగా మారింది. మంగళగిరి, గుంటూరు తదితర ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద తాకిడికి పొంగి సమీప పొలాలను ముంచెత్తుతోంది. రెండు గ్రామాల పరిధిలో నాలుగు వందల ఎకరాలు నేటికీ ముంపు బారిలోనే ఉన్నాయి. కొద్దిపాటి వర్షానికి సైతం ఎగువ ప్రాంతాల నుంచి డ్రెయిన్‌కు బారీగా వర్షపు నీరు చేరుతోంది. గత నెలలో కురిసిన భారీ వర్షానికి పదిహేను రోజులు పొలాలు నీట మునిగిపోవటంతో ఏపుగా ఉన్న పంటలు దెబ్బతిన్నాయి. శ్రమకోర్చి కుళ్లిపోయిన వరి పొలాలను దమ్ము చేసి, అధిక రేటుకు నారు కొనుగోలు చేసి మళ్లీ నాట్లు వేశారు. మరికొంతమంది రెండో సారి వెద పద్ధతిలో గింజలు నాటారు. కొద్ది రోజుల్లో భారీ వర్షం కురిసింది. దీంతో నాలుగు రోజులుగా వరి పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. ఏపుగా ఉన్న పొలాలు కుళ్లి పోయి పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతాంగం కోరుతున్నారు.

కన్నెత్తి చూడని వ్యవసాయశాఖాధికారులు

శలపాడు, వీరనాయకునిపాలెం తదితర గ్రామాల్లో వరి పొలాలు ముంపు బారిన పడి రైతులు ఆందోళన చెందుతుంటే, అండగా ఉండాల్సిన వ్యవసాయశాఖాధికారులు కన్నెత్తి కూడా చూడలేదు. మునిగిన పొలాల రక్షణకు సూచనలు, సలహాలు కూడా లేవు. నేటి వరకు తమ పొలాలను పరిశీలించ లేదని రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వరద తాకిడికి కుళ్లిపోయిన వరి

పంట నష్టపరిహారం అందించాలి

వందలాది ఎకరాలు రెండు నెలల కాలంలో మూడు సార్లు దెబ్బతినటంతో ఎకరానికి రూ.30వేల వరకు రైతులు నష్టపోయారు. ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను అంచనా వేసి, ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని లేనిపక్షంలో అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు సార్లు పంట మునిగింది



ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు మూడు సార్లు పంట మునిగిపోయింది. ఎకరం పది సెంట్లు పొలంలో ఒకసారి వెద పద్ధతిలో గింజలు పెట్టా.. రెండుసార్లు నాట్లు వేశా! దీంతో పెట్టుబడి రెట్టింపు అయింది. ప్రస్తుతం మళ్లీ పొలం అంతా మునిగి పైరు చచ్చిపోయింది. అధికారులు, నాయకులు ఆదుకుంటే సరి, లేదంటే సాగు చేయడం కష్టమే.

– పరసా శివయ్య, రైతు,
శలపాడు, చేబ్రోలు మండలం

వ్యవసాయాధికారులు ఎక్కడ ?



రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నా. భారీ వర్షాలతో పాటు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదలతో పొలాలు నీట మునిగిపోయాయి. ఎకరానికి ఇప్పటి వరకు రూ.30వేల వరకు పెట్టుబడి అయింది. నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– సూరగాని శ్రీనివాసరావు, కౌలు రైతు,
శలపాడు, చేబ్రోలు మండలం

పంట కుళ్లి పోయింది



తుంగభద్ర డ్రెయిన్‌కు ఇరు వైపులా ఉన్న వందలాది ఎకరాల పొలాల్లోకి భారీగా వరద నీరు చేరడంతో పొలాలు మునిగిపోయాయి. నేటికి కూడా నీళ్లు బయటకు పోలేదు. పైరు కుళ్లి పోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మూడు సార్లు నీట మునిగిపోయాయి. సాగు భారం కాకుండా సాయం చేయాలి.

– తోట శ్రీనివాసరావు,
రైతు, శలపాడు, చేబ్రోలు మండలం

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **2,000** గరిష్టం : రూ. **3,000**

మోడల్ ధర రూ. **2,500**

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	29,674
అమ్మకాలు	33,234
నిల్వ	4,705

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,500
నంబరు-5	10,000-13,500
273	10,000-13,300
341	10,000-15,300
సూపర్ -10	11,500-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,600
341	10,000-15,600

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,700
బాడిగ-355	10,000 - 15,400
దేవనూరు డీలక్స్	10,000 - 14,000
ఆర్మూర్	9,800 - 12,300
తాలుకాయలు	6,200 - 7,300

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-14,800
బాడిగ - 355	10,000-15,500
దేవనూరు డీలక్స్	10,000-14,000
తాలు	5,200 - 7,300

-కొరిటెపాడు (గుంటూరు)

క్లుప్తంగా

ఈశ్వర్ సాయి థియేటర్‌లో చోరీ

రూ.8లక్షలు విలువైన సామగ్రి అపహరణ



ఫిరంగిపురం: స్థానిక ఈశ్వర సాయి సినిమా థియేటర్‌లో గురువారం అర్థరాత్రి చోరీ జరిగింది. విలువైన సామగ్రి పోయినట్లు యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సేకరించిన సమాచారం ప్రకారం.. గత పది రోజులుగా థియేటర్‌లో సినిమాలు ప్రదర్శించడం లేదు. సమీపంలో గడ్డి కోసుకునేందుకు వచ్చిన యువకుడు గేటు తాళాలు పగలగొట్టి ఉండటం గమనించి యాజమాన్యానికి సమాచారం ఇచ్చాడు. కాగా థియేటర్ యజమాని తిరుపతి వెళ్లడంతో అతడి సోదరుడు చిట్టా విజయభాస్కరరెడ్డి వచ్చి పరిశీలించారు. విలువైన వస్తువులు దొంగిలించడంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. థియేటర్‌లో సీపీయూలు, బ్యాటరీలు, డైనమాలు, స్టెపిలైజర్లు, పాత జనరేటర్, విద్యుత్ మోటార్, వైరింగ్ సబ్ ఊపర్స్ తదితర వస్తువులు మాయమైనట్లు తెలిపారు. వీటి విలువ రూ. 8లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. సీఐ శివరామకృష్ణ ఆదేశాలతో సంఘటనా స్థలానికి ఎస్‌ఐ సురేష్ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. థియేటర్ ముందు భాగంలో ఆటో గుర్తులను గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆరు నెలల కిందట కూడా థియేటర్‌లో దొంగతనం జరగడంతో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు యజమాని బాపూజీరెడ్డి తెలిపారు.

వైద్య, విద్యా రంగాలను సర్వనాశనం చేస్తున్న చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య
- దోచుకునేందుకే ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ
- వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన నాయకులను అడ్డుకున్న పోలీసులు
- పేరేచర్ల-కొండమోడు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన



సత్తెనపల్లి పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య, విద్యార్థులు

సత్తెనపల్లి: రాష్ట్రంలో వైద్యం, వైద్య విద్యారంగాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సర్వనాశనం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన విభాగాల నాయకులు మండిపడ్డారు. పల్నాడు జిల్లాతోపాటు గుంటూరు జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పిడుగురాళ్ల మండలం కామేపల్లిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించేందుకు శుక్రవారం బయల్దేరారు. పోలీసులు ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు పెట్టి ఆంక్షలు విధిస్తూ అడ్డుకునే ప్రయత్నాలు చేపట్టారు. గుంటూరు నుంచి వచ్చే విద్యార్థి, యువజన విభాగ నాయకులను సత్తెనపల్లిలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. విద్యార్థులు ప్రయాణిస్తున్న కార్లు, వాహనాలను ఆపేసి దింపేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ వద్దకు వెళ్లడానికి వీల్లేదు.. నిరసన తెలియజేయడానికి వీల్లేదంటూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగ నాయకులతో పోలీసులు వాగ్వాదానికి దిగారు. ఆయా విభాగాల నాయకులు సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లోని పేరేచర్ల-కొండమోడు జాతీయ రహదారిపై బైఠాయించి పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మీడియాతో మాట్లాడుతూ ''మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తాము ఆందోళన చేస్తుంటే అడుగడుగునా ఆంక్షలు పెట్టి పోలీసులు అడ్డుకుంటున్నారు.. మేము పోలీసులను అడుగుతున్నాం.. అయ్యా మీ పిల్లలు కూడా చదువుకుంటున్నారు.. గంట సేపు రోడ్డుపై ట్రాఫిక్ ఆగినంత మాత్రాన ప్రజలు ఇబ్బందులు ఏమీ పడరు.. మెడికల్ కాలేజీలు ఆగిపోతే రాష్ట్రంలో ప్రజలతోపాటు, కొన్ని లక్షల మంది విద్యార్థులు నష్టపోతారా''ని తెలిపారు. వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఐదు నెలల్లో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకు రావడం జరిగిందన్నారు. ఏ ముఖ్యమంత్రి అయినా కేంద్ర ప్రభుత్వానికి ఏం అడుగుతారంటే తమ రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు కావాలని... మెడికల్ సీట్లు కావాలని కోరతారన్నారు. దుర్మార్గం ఏందంటే మన రాష్ట్రంలో మాత్రం మెడికల్ సీట్లు వద్దు.. మెడికల్ కాలేజీలు వద్దంటూ డైరెక్ట్‌గా ఎన్‌ఎంసీకి లెటర్ రాసిన వ్యక్తి దుర్మార్గుడు సీఎం చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ యువజన్ విభాగం గుంటూరు, కృష్ణా జిల్లాల కోఆర్డినేటర్ కళ్లం హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ నిరసన తెలియజేస్తే కదా విద్యార్థులు ఏం కోల్పోయారు.. పేదలు ఏం కోల్పోయారనేది తెలిసేదన్నారు. గుంటూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి మాట్లాడుతూ ''అనుమతి లేదని అడ్డుకుంటున్నారు.. పిల్లల భవిష్యత్తు కోసం అడుగుతున్నామని, కనీసం కొంత మందికైనా అనుమతి ఇవ్వాలని అడిగినా పోలీసులు ఇవ్వడం లేద''న్నారు. యువజన విభాగం గుంటూరు టౌన్ అధ్యక్షుడు వై.కోటేశ్వరరావు మాట్లాడుతూ అనుమతి లెటర్ పంపాం.. అయితే వారు అనుమతి ఇవ్వలేదన్నారు. నడుచుకుంటూ వెళతామంటే వదల్లేదని, విద్యార్థుల కోసం పోరాటం చేస్తుంటే అనుమతి లేదంటున్నారని తెలిపారు. శాంతియుతంగా చేస్తుంటే దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రెసిడెంట్ షేక్ సుభాని మాట్లాడుతూ అణచివేత ప్రభుత్వమంటే తెలుగుదేశం పార్టీ అని విమర్శించారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పులివెందుల మెడికల్ కాలేజీకి 50 సీట్లు ఇస్తే, సీట్లు వద్దు, పేదలకు ఉపయోగపడే పని చేయడం లేదని చెబుతున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయడమంటే ఒక వ్యక్తి ధనం ఆర్జించడమేనని తెలిపారు. ఎక్కడికక్కడ విద్యార్థులను ఆపి పోలీసులు సత్తెనపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన విభాగం నాయకులు చిన్నాబత్తిని వినోద్‌కుమార్, బాజీ, కానూరి శశిధర్, పిడతల భానుప్రకాష్, పేటేటి నవీన్‌కుమార్, రవీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

'చలో మెడికల్ కాలేజీ' గ్రాండ్ సక్సెస్

- తరలి వెళ్లిన యువత
- కూటమి ప్రభుత్వంపై ఆగ్రహ జ్వాలలు



పిడుగురాళ్ల మెడికల్ కళాశాల సమీపంలో నిరసన తెలుపుతున్న యువజన, విద్యార్థి విభాగం నేతలు

గుంటూరు రూరల్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'చలో మెడికల్ కళాశాల' కార్యక్రమానికి రూరల్ మండలం నుంచి విద్యార్థి, యువజన విభాగం నేతలు భారీగా తరలివెళ్లారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు, ప్రత్తిపాడు నియోజకవర్గం ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోని మెడికల్ కళాశాలకు భారీగా వెళ్లారు. నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు కొండా కోటిరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు అమడాల కెనడీల నేతృత్వంలో పార్టీ యువజన, విద్యార్థి విభాగం నేతలు భారీగా అక్కడకు వెళ్లారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ కుట్రలను భగ్నం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ అడ్డుకునేందుకు జగనన్న నేతృత్వంలో పోరాడతామని పేర్కొన్నారు. పేదల పక్షాన నిలుస్తామని చెప్పారు. పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ సమీపంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు.

పరిశుభ్రత, వ్యక్తిగత క్రమశిక్షణతో అభివృద్ధి

ఏపీజీబీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి



మొక్కలు నాటుతున్న ప్రమోద్‌కుమార్‌రెడ్డి, వీరబాబు తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): భారత ప్రభుత్వం, డీఎఫ్ఎస్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్(ఏపీజీబీ) అన్ని శాఖల్లో 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం పట్టాభిపురంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, రవీంద్రనగర్‌లలో మొక్కలు నాటి విద్యారులతో మాట్లాడారు. పరిశుభ్రత, వ్యక్తిగత క్రమశిక్షణ మనిషి అభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిప్పారు. దీంతో కుటుంబం, గ్రామం, రాష్ట్రం బలపడతాయని, చివరికి దేశాభివృద్ధికి దారి తీస్తుందని వివరించారు. పరిశుభ్రతను పాటించే వారు దేశానికి మరింత ఉత్పాదకతను అందించడంలో దోహదపడతారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుకున్న వారు అత్యున్నత స్థానాలకు ఎదగాలని, తాను కూడా అందులోనే చదివానని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.వీరబాబు మాట్లాడుతూ తమ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్‌చార్జి హరీష్ బేధా, ఏపీజీబీ జనరల్ మేనేజర్లు, మేనేజర్లు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు దీపం నగదు బదిలీ చేయాలి

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

గుంటూరు వెస్ట్: దీపం పథకం - 2 ద్వారా జిల్లాలో 1,257 మందికి సబ్సిడీ నగదు ఖాతాల్లో నమోదు కావడం లేదని వచ్చిన ఫిర్యాదులపై శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ హాలులో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ గ్యాస్ ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్లు, సివిల్ సప్లయ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, తెనాలి, మేడికొండూరు మండలాల్లో ఎక్కువగా నగదు జమ కాలేదని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. 1257 మంది జాబితాను గ్యాస్ ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్లకు పంపాలని జిల్లా సప్లయ్ అధికారికి సూచించారు. వినియోగదారులకు ఫోన్ చేసి ఎందుకు సబ్సిడీ నగదు పడలేదో వివరించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను వచ్చే బుధవారం నాటికి పూర్తి చేయాలని చెప్పారు. ఎల్‌డీఏం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులు లేటెస్ట్ ఆధార్ కార్డు , పాసు పుస్తకం బ్యాంక్‌కు తీసుకువెళ్లి అక్కౌంట్ డీ లింక్ చేయించుకుని, మళ్లీ లింక్ చేయించాలని సూచించారు. కొంత మందికి ఆధార్ ఇన్ ఆక్టివ్ అని వస్తున్నదని, వారికి పొరపాటున రెండు ఆధార్‌లు ఉంటే ఒక కార్డును ఇవ్వాలని తెలిపారు. కొందరికి ఆధార్ బ్యాంక్ ఖాతాకు లింక్ కానందున, ఈకేవైసీ చేయించుకోకపోవడం వల్ల సబ్సిడీ జమ కావడం లేదని వివరించారు. ఆధార్ అప్ డేట్ వివరాలు లేనివారు 1,031 మంది ఉన్నారని , వారు వివరాలు అందజేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్‌ఓ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు రుణాల మంజూరుపై అవగాహన

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వానిధి 2.0 లోక కల్యాణం పథకం ద్వారా వీధి విక్రయదారులు, చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి రూ.10 నుంచి 50వేల వరకు రుణాలు లభిస్తాయని మెప్మా పీడీ వి. విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గతంలో రూ.10వేలు తీసుకున్న వారికి రూ.20వేలు, రూ. 20 వేలు తీసుకున్న వారికి రూ.50వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు నేటి శనివారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని వారికి నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో, మంగళగిరి,తాడేపల్లి పరిధిలోని వారికి మంగళగిరి మున్సిపల్ కౌన్సిల్ హాలులో 22న, తెనాలి పరిధిలోని వారికి తెనాలి మున్సిపల్ కౌన్సిల్ హాలులో 23న, పొన్నూరు పరిధిలోని వారికి పొన్నూరు మున్సిపల్ కౌన్సిల్‌లో 24న అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వీధి విక్రయదారులు, చిన్న వ్యాపారాలు హాజరుకావాలని ఆమె సూచించారు.

వైద్య విద్య ప్రైవేటీకరణ ఆపాలి



గుంటూరులో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయాన విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ రఘువీర్ డిమాండ్ చేశారు. జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మార్కెట్ సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రఘువీర్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను లోకేష్ అమలుపరచకుండా రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారని మండిపడ్డారు. సూపర్ హిట్ సుపరిపాలన అంటూ సంబరాలు చేసుకుంటున్నారు గానీ విద్యార్థుల కష్టాలు తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసిన రూ.600 కోట్లు కేవలం పేపర్ ప్రకటనకే పరిమితమయ్యాయే తప్పా ఒక్క విద్యార్థి ఖాతాలో జమ కాలేదని తెలిపారు. వైద్య విద్య ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. పీపీపీ విధానంలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందని ద్రాక్షలాగా అవుతుందని పేర్కొన్నారు. బీసీ ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అమర్నాథ్, నగర కార్యదర్శి ప్రణీత్, నగర నాయకులు అజయ్, సాయి గణేష్, రాహుల్, వెంకట్, కుమార్, అజయ్ పాల్గొన్నారు.

రైల్వే ప్రాంగణాల పరిశుభ్రత సమష్టి బాధ్యత

డీఆర్ఎం సుథేష్ట సేన్



గుంటూరు రైల్వే స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న డీఆర్ఎం, సిబ్బంది

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : స్వచ్ఛ భారత్ దార్శనికతకు అనుగుణంగా రైల్వే ప్రాంగణాలను, పరిసరాలను శుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడంలో సమష్టి బాధ్యత వహించాలని గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్ఎం సుథేష్ట సేన్ పిలుపు నిచ్చారు. పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలం నుంచి గుంటూరు రైల్వే స్టేషన్ వరకు స్వచ్ఛతా హి సేవ -2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డివిజన్ అధికారులు, సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్, వలంటీర్లతో కలిసి డీఆర్ఎం ప్రారంభించారు. ర్యాలీలో సిబ్బంది, అధికారులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి రైల్వే స్టేషన్, కార్యాలయాల ప్రాంగణంలో ఆకు పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విధులు నిర్వహించడం వల్ల మానసిక సంతృప్తి దక్కుతుందని తెలిపారు. పచ్చని చెట్లు చుట్టు ఉన్న ప్రాంగణాల్లోకి కలుషితమైన గాలి రాదని తెలిపారు. అనంతరం ర్యాలీని విజయవంతంగా రైల్వే స్టేషన్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్ఎం కార్యాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈనెల 26 నుంచి 29 వరకు జరగనున్న ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనే గుంటూరు జిల్లా అండర్- 14 ,16 బాలబాలికల జట్టు వివరాలను అథ్లెటిక్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్ ప్రసాద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 26వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో వయస్సు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డు తీసుకొని గుంటూరు జట్టు కోచ్ కె.రవిని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎంపికైన క్రీడాకారుల వివరాలు

అండర్ 14 బాలుర విభాగం: డి. వెంకట సాయి, బి. గణ రమేష్, కె. నాగసాయి


అండర్-14 బాలికలు: పి. హర్షిణి, పి. హాసిని, వై. అన్ని అక్షర

అండర్ 16 బాలికలు: పి. చేతనశ్రీ, జి. పావని, మహమ్మద్ అలీఫా షేక్, షేక్ హీనా సుభానం, పి. అంకిత, సీహెచ్. కరుణ, ఎండి. కరిష్మా, టి. వెంకట స్వాతి.

అండర్ 16 బాలురు: బి.ఎల్.ఎస్. శ్రీహర్ష, జి. రుషి కిరణ్, జి. సూర్యతేజ, ఎస్‌కే ఎండీ అష్రఫ్, ఎం. రాజ్ కుమార్, ఎం. సుహాస్, ఏ. వెంకటరెడ్డి ఏ. కృష్ణవంశీ, కె.నవ్య ప్రదీప్, కె.మణిదీప్, జె. హరి వెంకట్ అఖిల్

సమస్యలపై చర్చించే తీరిక ప్రభుత్వానికి లేదా ?

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



రణభేరిలో నినాదాలు చేస్తున్న నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించే తీరిక కూటమి ప్రభుత్వానికి లేకుండా పోయిందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు విమర్శించారు. శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద విద్యారంగ, ఉపాధ్యాయ అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ తలపెట్టిన రణభేరి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయుల బైక్ ర్యాలీకి జెండా ఊపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2023 జూలై నుంచి వర్తింప చేయాల్సిన 12వ పీఆర్సీపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఎటూ తేల్చలేదని, నాలుగు విడతలుగా డీఏ బకాయిలు పేరుకు పోయాయని ఆరోపించారు. సంబంధిత ఆర్థిక అంశాలపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఒక్కరోజు సైతం చర్చించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై నిందలు మోపుతూ వారిని ఒత్తిడి గురి చేసే విధానాలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించకపోవడంతో పాటు నాలుగు విడతల డీఏ బకాయిలపై వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏ.ఎస్. కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌కు తావులేని పాఠశాల కావాలని, ప్రభుత్వ పాఠశాలను రక్షించుకుని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్ మాట్లాడుతూ ఈనెల 25న జరిగే రణభేరి రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

చిన్నారులతో అసభ్యకరంగా ప్రవర్తించిన వృద్ధుడు

- ప్రభుత్వ పాఠశాలలో దురాగతం
- పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు

ప్రత్తిపాడు: మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో దురాగతం చోటుచేసుకుంది. అభం శుభం తెలియని చిన్నారులపై వృద్ధుడు అవమానకర రీతిలో అసభ్యకరంగా వ్యవహరించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రావిపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో స్కావెంజర్‌గా చేస్తున్న వాసిమళ్ల నాగమ్మకు కొద్దిరోజులుగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆమె భర్త సామియేలు (75) పాఠశాలకు వస్తున్నాడు. ప్రధానోపాధ్యాయుడు కూడా బుధవారం వరకూ అనారోగ్య సమస్యలతో సెలవులో ఉన్నారు. బడిలో విధుల్లో ఉన్న ఒక్క టీచర్ విద్యార్థులందరినీ ఒకే తరగతి గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. మూడు రోజుల కిందట పక్క తరగతి గదిలోని వరండాలో ఉన్న వాటర్ కూలర్ దగ్గర మంచి నీళ్లు తాగేందుకు వచ్చిన ఒకటవ తరగతి చిన్నారి పైనా, మూడవ తరగతి చిన్నారి పైనా అక్కడే ఉన్న సామియేలు అసభ్యంగా ప్రవర్తించాడు. అభం శుభం తెలియని చిన్నారులను ప్రైవేటు ప్లేసుల్లో తాకుతూ పైశాచికంగా ప్రవర్తించాడు. విద్యార్థులు ఏడుస్తూ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు గురువారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను నిలదీశారు. ఇలాంటి పనులు చేస్తుంటే ఏం చేస్తున్నారని మండిపడ్డారు. పసి పిల్లలపై ఇటువంటి అసభ్య పనులేంటంటూ సామియేలు పైనా ఉపాధ్యాయులపై తల్లిదండ్రులు నిప్పులు చెరిగారు. దీంతో సామియేలు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో 18వ తేదీ రాత్రి ఎస్‌ఐ నరహరి సామియేలుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. శుక్రవారం విషయం జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు తెలియడంతో వారి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు ఎంఈవో సీహెచ్ రమాదేవి పాఠశాలలో ప్రాథమిక విచారణ నిర్వహించారు. హెచ్ఎం రవితో పాటు ఉపాధ్యాయురాలు, విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు.

నేడు తైక్వాండో ఎంపిక పోటీలు

నగరం: ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 20వ తేదీన బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అల్లపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కే వెంకటేశ్వరావు శుక్రవారం తెలిపారు. అండర్ 14,17 విభాగాలలో ఎంపికలు ఉంటాయన్నారు. అండర్ 14 విభాగానికి 01-01-2012 తర్వాత, అండర్ 19 విభాగంలో 01-01-2009 తర్వాత జన్మించిన వారు అర్హులని చెప్పారు.

క్లుప్తంగా...

23న గ్రూప్‌-2 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ గ్రూప్‌-2 మెయిన్స్ పాసైన మరికొందరు అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు కమిషన్ ఎంపిక చేసింది. వివిధ వర్గాల్లో కొత్తగా 14 మందిని ఎంపిక చేసి, వారిని ఈనెల 23న సర్టిఫికెట్ల పరిశీలనకు రావాల్సిందిగా ఇన్‌చార్జి కార్యదర్శి నరసింహ మూర్తి కోరారు. అభ్యర్థుల హాల్‌టికెట్ల నంబర్లు సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచామని, నిర్ణీత తేదీలో విజయవాడలోని సర్వీస్ కమిషన్ కార్యాలయంలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీడీసీపై సీఐడీ దర్యాప్తు జరుగుతోంది

మంత్రి పార్థసారథి వెల్లడి

సాక్షి, అమరావతి: 2019-24 మధ్య ఏపీ డిజిటల్ కార్పొరేషన్(ఏపీడీసీ) ద్వారా రూ.2 కోట్ల నిధులు దారి మళ్లించి యాత్ర-2 సినిమా కోసం ఖర్చు చేశారని మంత్రి పార్థసారథి సమాధానమిచ్చారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల వీడియో చిత్రీకరణ నిమిత్తం మెస్సర్స్ త్రీ ఆటమ్ లీవ్స్ అండ్ ఏ స్టోరీ ఎల్ఎల్‌పీ సంస్థకు రూ.2.12 కోట్లు చెల్లించారని చెప్పారు. నిధుల మళ్లింపుపై వచ్చిన అభియోగాలను పరిగణనలోకి తీసుకుని విచారణకు కమిటీ వేశామని తెలిపారు. శుక్రవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, కూన రవికుమార్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు.

21న ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష

పెదకాకాని(ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున విద్యాలయం(ఏఎన్‌యూ) దూరవిద్య కేంద్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 21వ తేదీన ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు దూరవిద్య కేంద్రం పరీక్షల కో-ఆర్డినేటర్ ఆచార్య దిట్టకవి రామచంద్రన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 10 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎంబీఏకు 373, ఎంసీఏకు 67 చొప్పున మొత్తం 440 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేయని అభ్యర్థులు నేరుగా పదో తరగతి మార్క్‌లిస్ట్, డిగ్రీ ప్రొవిజినల్, మార్కుల జాబితా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పరీక్ష కేంద్రానికి వచ్చి రూ.500 తత్కాల్ ఫీజు చెల్లించి నేరుగా పరీక్షకు హాజరుకావొచ్చని వివరించారు. ఫలితాలను 22వ తేదీ విడుదల చేస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 9848477441, 0863-2346323 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు

మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఉల్లి రైతులకు హెక్టార్‌కు రూ.50 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయనున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై సుమారు రూ.100 కోట్ల అదనపు భారం పడుతుందని చెప్పారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 45,278 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేసిన 24, 218 మంది రైతులు లబ్ధిపొందుతారని మంత్రి వివరించారు.

తాడిపత్రిలో టెన్షన్.. టెన్షన్

కేతిరెడ్డి ఇంటి వద్ద అనుచరులతో జేసీ కవ్వింపు చర్యలు



కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి ముందు అనుచరులతో టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోసారి టెన్షన్ వాతావరణం నెలకొంది. టీడీపీ నాయకుడు, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం తన అనుచరులతో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి ముందుకొచ్చి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. అంతకుముందు.. పెద్దారెడ్డి పోలీసు బందోబస్తు మధ్య శుక్రవారం ఉదయం తన నివాసానికి చేరుకున్నారు. తన ఇంటికి వెనుక వైపునున్న ప్రహరీ కొంత తొలగించి గేటు నిర్మాణం చేపట్టారు. అయితే, అది నచ్చని జేసీ మున్సిపల్ అధికారులను ఉసిగొల్పి గేటును ధ్వంసం చేయించి యథావిధిగా గోడ నిర్మాణం చేపట్టారు. ఆ సమయంలో సోషల్ మీడియా ద్వారా తన అనుచరులను వెంటనే రావాలంటూ జేసీ మెసేజ్ పెట్టారు. అనుచరులు తన ఇంటి వద్దకు చేరుకోగానే జేసీ ప్రభాకర్‌రెడ్డి వారితో కలిసి కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి ముందున్న కళాశాల క్రీడా మైదానంలోకి చేరుకున్నారు. కేకలతో రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించారు. అదే సమయంలో ఏఎస్పీ రోహిత్‌కుమార్ పోలీసు బలగాలతో వచ్చి వారిని వెనక్కి పంపడంతో సమస్య సద్దుమణిగింది. మరోవైపు.. కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి సమీపంలో పోలీసులు బారికేడ్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రాజెక్టులపై అబద్ధాల ప్రవాహం

అసెంబ్లీ వేదికగా పచ్చి అసత్యాలు వల్లె వేసిన సీఎం చంద్రబాబు

దాదాపు అన్నిటికి తానే పునాదిరాయి వేసి, పూర్తి చేశానంటూ బీరాలు

- కోటి ఎకరాలకు నీళ్లందించడమే లక్ష్యంగా 83 ప్రాజెక్టులను 2004లో జలయజ్ఞం కింద చేపట్టిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి
- వైఎస్సార్ హయాంలోనే 43 ప్రాజెక్టులను పూర్తి చేసి.. 32 లక్షల ఎకరాలకు నీళ్లందించారంటున్న నిపుణులు
- ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులను పూర్తి చేసింది వైఎస్ జగనే అని స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: కళ్లార్పకుండా.. జంకుగొంకు లేకుండా.. పచ్చి అసత్యాలు చెప్పడంలో తనను మించిన వారు ఉండరని అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబు మరోసారి చాటుకున్నారు! ఉమ్మడి రాష్ట్రంలోగానీ విభజిత రాష్ట్రంలోగానీ దాదాపుగా అన్ని సాగునీటి ప్రాజెక్టులకు తానే శంకుస్థాపన చేశానని.. వాటిని తానే పూర్తి చేశానని సెలవిచ్చారు. దేశంలో నదుల అనుసంధానంపై వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తాను ప్రస్తావిస్తేనే ఓ కమిటీ వేశారని.. దాని స్ఫూర్తితోనే ఆ ప్రక్రియ మొదలైందని చంద్రబాబు చెప్పడంపై సాగునీటి రంగ నిపుణులు, రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 1996 లోక్‌సభ ఎన్నికలు, 1999 సార్వత్రిక ఎన్నికల గండం నుంచి గట్టెక్కేందుకు సాగునీటి ప్రాజెక్టులకు పునాది రాయివేసి.. ఆ తర్వాత తట్టెడుమట్టి కూడా ఎత్తకుండా ప్రజలను వంచించారని గుర్తు చేస్తున్నారు. దీన్ని నిరసిస్తూ 1999 నుంచి 2004 మధ్య ప్రతిపక్షనేతగా ఉన్న దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి నాడు చంద్రబాబు వేసిన పునాదిరాళ్ల వద్ద మొక్కలను నాటారని గుర్తు చేస్తున్నారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉమ్మడి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా కోటి ఎకరాలకు నీళ్లందించేందుకు రూ.లక్ష కోట్ల వ్యయంతో ఒకేసారి 83 ప్రాజెక్టులను జలయజ్ఞం కింద చేపట్టారు. 2009 నాటికే 43 ప్రాజెక్టులను పూర్తి చేసి 32 లక్షల ఎకరాలకు నీళ్లందించారు. జలయజ్ఞం కింద చేపట్టిన ప్రాజెక్టుల్లో సంగం బ్యారేజీ, నెల్లూరు బ్యారేజీ, గాలేరు-నగరి తొలిదశ, వెలిగొండ సొరంగాలను పూర్తి చేసి.. పులిచింతల, సోమశిల, కండలేరు, చిత్రావతి, గండికోట, బ్రహ్మంసాగర్‌లలో పునరావాసం, మిగిలిన పనులను పూర్తి చేసి గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేయడం ద్వారా కొత్తగా ఐదు లక్షల ఎకరాలకు 2019-24 మధ్య నాటి సీఎం వైఎస్ జగన్ నీళ్లందించారని గుర్తు చేస్తున్నారు.

పోలవరంలో విధ్వంసం సృష్టించింది చంద్రబాబే..


తెలుగు ప్రజల చిరకాల స్వప్నమైన పోలవరం ప్రాజెక్టును 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి సాకారం చేస్తూ.. ఆ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు తెచ్చి పనులు ప్రారంభించారు. 2009 నాటికే రూ.5 వేల కోట్లు వ్యయం చేసి, సింహభాగం భూసేకరణను పూర్తి చేసి, కుడి, ఎడమ కాలువలను అధిక శాతం పూర్తి చేశారు. ఆ ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, నిధులు ఇచ్చేలా కేంద్రాన్ని ఒప్పించే ప్రక్రియను పూర్తి చేశారు. విభజన నేపథ్యంలో ఆ ప్రాజెక్టును వంద శాతం వ్యయం భరించి తామే పూర్తి చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. ఆ ప్రాజెక్టును పూర్తి చేయడానికి 2014, మే 28 పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఏర్పాటుచేసింది. కానీ.. కమీషన్ల దాహంతో, కేంద్రం కట్టాల్సిన పోలవరం నిర్మాణ బాధ్యతలను 2016, సెప్టెంబరు 7న చంద్రబాబు 2013-14 ధరల ప్రకారం పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికి తీసుకున్నారు. ఆ తర్వాత ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ మాన్యువల్‌ను తుంగలో తొక్కి.. కమీషన్లు అధికంగా వచ్చే పనులను చేపట్టారు. గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలను పూర్తి చేయకుండానే.. ప్రధాన డ్యాం పునాది డయాఫ్రం వాల్‌ను 2018 నాటికే పూర్తి చేశారు.. అది అప్పట్లో వచ్చిన వరదలకే కోతకు గురై దెబ్బతిందని అంతర్జాతీయ నిపుణుల కమిటీ తేల్చిచెబుతూ కేంద్రానికి నివేదిక ఇచ్చింది. 2019లో వైఎస్ జగన్ సీఎం అయ్యాక.. ఆ ప్రాజెక్టును గాడిలో పెట్టారు. స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలను పూర్తి చేసి 2021, జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించారు. తాజా ధరల మేరకు పోలవరానికి నిధులు ఇచ్చేలా కేంద్రాన్ని ఒప్పించారు. ఆ ఫలితంగానే రూ.12,157.53 కోట్లు విడుదలకు కేంద్రం అంగీకరించింది. 2014-19 మధ్య సీఎం చంద్రబాబు చారిత్రక తప్పిదానికి పాల్పడకుండా ఉండి ఉంటే.. 2022 నాటికే వైఎస్ జగన్ ఆ ప్రాజెక్టును పూర్తి చేసేవారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కానీ.. 2024లో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు.. పోలవరంలో నీటి నిల్వను 41.15 మీటర్లకే పరిమితం చేసి, దాన్ని బ్యారేజ్‌గా మార్చేసి.. రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని పేర్కొంటున్నారు.

హవ్వ.. నవ్విపోదురుగాక..!

- హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకానికి 1996 మార్చి 11న తానే భూమి పూజ చేశానని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ క్రమంలో 40 టీఎంసీల హంద్రీ-నీవాను 5 టీఎంసీలకు కుదించి తాగునీటి పథకంగా చేపట్టేందుకు 1999 ఎన్నికలకు ముందు మరో సారి పునాదిరాయి వేశానని చెప్పుకోలేకపోయారు. 1995 నుంచి 2004 మధ్య హంద్రీ-నీవా కోసం కేవలం రూ.13.75 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.. అదీ రెండు సార్లు శంకుస్థాపన, బహిరంగ సభలకు జనసమీకరణ, ఉద్యోగుల జీతభత్యాలకు చేసిన వ్యయమే. ఆ తొమ్మిదేళ్లలో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక హంద్రీ-నీవా సుజల స్రవంతి పనులు చేపట్టి తన హయాంలోనే రూ.6,948.20 కోట్లు వ్యయం చేసి తొలిదశను పూర్తి చేశారు. రెండో దశలో 80 శాతం పూర్తి చేశారు. దాంతో 2012లో హంద్రీ-నీవా తొలి దశను అప్పటి ప్రభుత్వం జాతికి అంకితం చేస్తూ ఆ పథకంలో అంతర్భాగమైన జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా జలాలను తరలించింది. శ్రీశైలంలో 795 అడుగుల నుంచే హంద్రీ-నీవా ప్రధాన కాలువలోకి నీటిని ఎత్తిపోసేలా ముచ్చుమర్రి ఎత్తిపోతలను 2007, ఆగస్టు 31న చేపట్టిన నాటి సీఎం వైఎస్ 2009 నాటికే 90 శాతం పనులు పూర్తి చేశారు. ఇదీ వాస్తవం. 2014-19 మధ్య హంద్రీ-నీవాకు టీడీపీ సర్కార్ రూ.4,182.68 కోట్లు వ్యయం చేసి.. జీవో 22(ధర సర్దుబాటు) పేరుతో కాంట్రాక్టర్లకు అదనపు నిధులు దోచిపెట్టి కమీషన్లు వసూలు చేసుకున్నారని సాగునీటిరంగ నిపుణులు ప్రస్తావిస్తున్నారు. 2019-24 మధ్య వైఎస్ జగన్ హంద్రీ-నీవా సామర్థ్యం 40 టీఎంసీల కంటే అధికంగా తరలించి.. రాయలసీమను సస్యశ్యామలం చేశారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు ప్రధాన కాలువ సామర్థ్యం 3,850 క్యూసెక్కులను తరలిస్తామనే పేరుతో లైనింగ్ పనులు చేపట్టి, కాంట్రాక్టర్లకు నిధులైతే దోచిపెట్టారని.. కానీ ఇప్పటికీ పూర్తి సామర్థ్యం మేరకు నీటిని తరలించిన దాఖలాలు లేవని విమర్శిస్తున్నారు.
- వెలిగొండ ప్రాజెక్టుకు 1996 ఏప్రిల్ 20న తాను భూమిపూజ చేశానని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆ భూమి పూజ సందర్భంగా నిర్వహించిన సభ కోసం రూ.పది లక్షలు ఖర్చు చేశారు. కానీ.. 2004 వరకూ అధికారంలో ఉన్న చంద్రబాబు ఆ ప్రాజెక్టులో తట్టెడుమట్టి కూడా ఎత్తలేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో అధికారంలోకి వచ్చాక ఆ ప్రాజెక్టును చేపట్టి తన హయాంలో రూ.3,581.57 కోట్లు వ్యయం చేసి సింహభాగం పనులు పూర్తి చేశారు. కానీ.. 2014-19 మధ్య ఆ ప్రాజెక్టు కోసం రూ.1,414.51 కోట్లు వ్యయం చేసిన సీఎం చంద్రబాబు.. జీవో 22, జీవో 63లను అడ్డుపెట్టుకుని కాంట్రాక్టర్లకు రూ.650 కోట్లకుపైగా దోచిపెట్టారని.. టీబీఎం(టన్నెల్ బోరింగ్ మెషీన్)ల మరమ్మతుల పేరుతో మరో రూ.66.44 కోట్లు దోచిపెట్టారని నిపుణులు ప్రస్తావిస్తున్నారు. 2019-24 మధ్య వైఎస్ జగన్ రూ.1,046.46 కోట్లు వ్యయం చేసి ఆసియాలో అతి పొడవైన రెండు సొరంగాలను పూర్తి చేశారు. కేవలం రూ.905 కోట్లు వ్యయం చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించి ఉంటే.. 2024 ఆగస్టులోనే శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను వెలిగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన నల్లమలసాగర్‌కు తరలించే అవకాశం ఉండేదని.. కానీ కమీషన్లు రావనే నెపంతో ఆ పనులు కూటమి సర్కార్ చేపట్టడం లేదని.. ఇప్పుడేమో 2026, జూలైకి పూర్తి చేస్తామని కొత్త పాట పాడుతున్నారని సాగునీటిరంగ నిపుణులు తప్పుబడుతున్నారు.
- తుంగభద్ర డ్యాం 19వ గేటు గతేడాది ఆగస్టు 10న కొట్టుకుపోతే.. ఆ డ్యాం భద్రతపై కేంద్రం నియమించిన ఏకే బజాజ్ కమిటీ.. కాలం చెల్లిన 33 గేట్లను మార్చాల్సిందేనని నిరుడు సెప్టెంబరు 10న నివేదిక ఇచ్చింది. తుంగభద్ర బోర్డు నిబంధనల ప్రకారం డ్యాం మరమ్మతులకు అవసరమైన నిధులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలుత విడుదల చేయాలి.. ఆ తర్వాత వాటా నిధులను కర్ణాటక, తెలంగాణ విడుదల చేస్తాయి. కానీ.. టీడీపీ కూటమి ప్రభుత్వం గేట్ల మార్పునకు రూ.54.42 కోట్లను సకాలంలో విడుదల చేయలేదు. దాంతో ఈ ఏడాది ఆ డ్యాంలో గరిష్ఠ స్థాయిలో 105 టీఎంసీలు కాకుండా కేవలం 80 టీఎంసీలు మాత్రమే నిల్వ చేయాల్సిన దుస్థితి ఉత్పన్నమైంది. దీని వల్ల ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో నీళ్లందించలేని పరిస్థితి నెలకొంది.
- వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తన సూచన మేరకే నదుల అనుసంధానంపై కమిటీ వేశారని.. దాని వల్ల నదుల అనుసంధానం ప్రక్రియ మొదలైందని సీఎం చంద్రబాబు సెలవివ్వడంపై సాగునీటిరంగ నిపుణులు నిర్ఘాంతపోతున్నారు. నదుల అనుసంధానం చేయడం ద్వారా దేశాన్ని సస్యశ్యామలం చేయడానికి, వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి 1980 నాటికే ప్రణాళికను కేంద్రం రూపొందించిందని గుర్తుచేస్తున్నారు. ఆ ప్రణాళిక అమలులో నిర్లక్ష్యంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీం కోర్టు విచారించి.. 2002లో నదుల అనుసంధానాన్ని చేపట్టాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ తీర్పు ఇచ్చిందని.. ఆ మేరకే నదుల అనుసంధానంపై కమిటీ ఏర్పాటుచేసి.. ఆ ప్రక్రియను కేంద్రం చేపట్టిందని స్పష్టం చేస్తున్నారు.
- సాగునీటి ప్రాజెక్టులపై 2014-19 మధ్య తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై రూ.68,417 కోట్లు ఖర్చు చేస్తే.. 2019-24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.28,376 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని సీఎం చంద్రబాబు చెప్పారు. కానీ.. జీవో 22, జీవో 63ల ద్వారా 2014-19 మధ్య వ్యయం చేసిన నిధుల్లో అధిక శాతం అంచనాలు పెంచి కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని సాగునీటిరంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దీనికి నిదర్శనం.. ఆ ఐదేళ్లలో కొత్తగా నీళ్లు ఇచ్చిన ఆయకట్టు 3.84 లక్షల ఎకరాలు మాత్రమేనని పేర్కొంటున్నారు. 2019-24 మధ్య వైఎస్ జగన్ సర్కార్ ప్రతి రూపాయిని సద్వినియోగం చేసుకుంటూ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసిందని గుర్తు చేస్తున్నారు.

ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి

ఇందుకు రూ.70 వేల కోట్లు ఖర్చుచేస్తాం	బనకచర్ల ద్వారా 200 టీఎంసీల గోదావరి జలాలు తరలిస్తాం
	ఈ ఏడాది ఇప్పటికే 3,732 టీఎంసీల నీరు కడలిపాలైంది
	అసెంబ్లీలో జలవనరులపై చర్చలో సీఎం చంద్రబాబునాయుడు



సాక్షి, అమరావతి: వచ్చే ఐదేళ్లలో రూ.70 వేల కోట్లు వెచ్చించి రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఇప్పటికే 15 నెలల్లో రూ.12,454 కోట్లు వ్యయం చేశామని, 2027 డిసెంబరు నాటికి పోలవరం, వచ్చే ఏడాది జులై నాటికి వెలిగొండ ప్రాజెక్టులను పూర్తిచేస్తామన్నారు. నీటి సమర్థ నిర్వహణ అంశంపై శుక్రవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురవడంవల్ల అన్ని ప్రాజెక్టుల్లో 74 శాతానికి పైగా నీటి నిల్వలున్నాయన్నారు. గోదావరి మిగులు జలాల్లో 200 టీఎంసీలను పోలవరం-బనకచర్ల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఎత్తిపోసి రాయలసీమకు నీటిని అందిస్తామన్నారు. వంశధారకు వరదలు వస్తే ఆ నీటిని పెన్నా సోమశిలకు తరలిస్తామన్నారు.

భూగర్భ జలాల పెంపుపై ఎమ్మెల్యేలు దృష్టిపెట్టాలి..

ఇక రాష్ట్రంలో భూగర్భ జలాలు పెంచడం ద్వారా 700 టీఎంసీలు వినియోగించుకోవచ్చని.. ఇందుకోసం ప్రతీ నియోజకవర్గం వారీగా ప్రణాళికలు సిద్ధంచేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతీ ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో భూగర్భ జలాలు పెంచడంపై దృష్టిసారించాలన్నారు. ఇందుకోసం అవేర్ పేరిట ప్రత్యేక వ్యవస్థను తీసుకొస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎంత వర్షం పడింది.. ఎంత ఒడిసి పట్టుకున్నాం.. భూగర్భ జలాలు ఎంతమేర ఉన్నాయన్న అంశాలను సెన్సార్ల ద్వారా తెలుసుకుని మ్యాపింగ్ చేస్తామని, ఈ డేటా ఆధారంగా నీటి నిర్వహణను చేపట్టనున్నామన్నారు. ఎటువంటి విద్వేషాలు లేకుండా సముద్రంలో కలిసిపోయే నీటిని వినియోగించుకుందామని పొరుగు రాష్ట్రాలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు సీఎం తెలిపారు.

పీపీపీ విధానంలోనే మెడికల్ కాలేజీలు..

ఈ చర్చ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల వివాదం ప్రస్తావనకు రాగా, చంద్రబాబు స్పందిస్తూ.. సంస్కరణలతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని, ఎవరెంత భయపెట్టినా పీపీపీ విధానంలోనే మెడికల్ కాలేజీలు కట్టితీరుతామని తేల్చిచెప్పారు. అధికారం ఇచ్చినప్పుడు రూ.650 కోట్లు ఖర్చుచేయలేనివాడు, ప్రభుత్వ ఆస్తులన్నీ తగలబెట్టిన వాడు మెడికల్ కాలేజీలు కట్టి ఉద్ధరిస్తానంటున్నాడని.. ఇది ఎవరిని మోసం చేయడానికంటూ విమర్శించారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంవల్ల ఎవరికీ నష్టం ఉండదని, పైగా నాణ్యతా ప్రమాణాలు బాగుంటాయన్నారు.

వలపు వల.. వంచించెనిలా!

మత్తెక్కించే మాటలు.. నగ్న వీడియోలు

యువకులను మోసగిస్తున్న ముఠా గుట్టురట్టు

కర్నూలు: సులువుగా డబ్బు సంపాదనకు అలవాటు పడిన భార్య, భర్త, ఓ ప్రేమికురాలు ముఠాగా ఏర్పడి మత్తెక్కించే మాటలతో యువకులను ఆకట్టుకొని, ఆ తర్వాత బెదిరించి డబ్బు గుంజుతున్న వ్యవహారాన్ని పోలీసులు గుట్టురట్టు చేశారు. తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి బలరాం నగర్‌కు చెందిన చిక్కిరి మల్లేష్, భార్య పెరుమాళ్ల మేరీ, మల్లేష్ ప్రేమికురాలు మొల్లం మల్లిక అలియాస్ లిల్లీ ముఠాగా ఏర్పడి డబ్బున్న వారి ఫోన్ నెంబర్లు సేకరిస్తుంటారు. వారికి ఫోన్ చేసి తీయనైన మాటలతో ముగ్గులోకి దింపి నగ్న వీడియోలు పంపి బెదిరించి డబ్బులు దండుకునేవారు. కర్నూలుకు చెందిన వ్యాపారి ప్రదీప్ ఈ ముఠా సభ్యుల మాటలను నమ్మి దాదాపు రూ.3.80 కోట్ల నగదు వారి ఖాతాలకు బదిలీ చేసి మోసపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సాంకేతికత సాయంతో వారు వినియోగించిన కాల్ డేటా ఆధారంగా రెండో పట్టణ పోలీసులు ముఠా సభ్యుల గుట్టు రట్టు చేసి కటకటాలకు పంపారు.

తక్కువ ధరకే పొలం ఇస్తామంటూ మోసం..

ముగ్గురు ముఠా సభ్యులు కలసి సంయుక్త రెడ్డి పేరుతో ట్విటర్ ఖాతా ద్వారా నగ్నంగా వీడియో కాల్స్ చేసి మత్తెక్కించే మాటలతో నమ్మించి మోసానికి పాల్పడ్డారు. విజయవాడకు సమీపంలో తమకు ఖరీదైన పొలం ఉందని, డబ్బులు అవసరమున్నందున తక్కువ ధరకే ఇస్తామంటూ రూ.3.80 కోట్లు వసూలు చేశారు. రూ.41.26 లక్షలకు రెండు కార్లు, ఓ మోటర్ సైకిల్, బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారు. మిగిలిన డబ్బు రూ.3.38 కోట్ల నగదును ముగ్గురూ పంచుకుని జల్సా చేశారు. ప్రదీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ముఠా సభ్యులను అరెస్టు చేసి విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. వారి నుంచి 2 కార్లు, మోటర్ సైకిల్, ల్యాప్‌టాప్, 3 సెల్‌ఫోన్లు, 5 తులాల బంగారం రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు పేర్కొన్నారు.

అజ్ఞానుల్లో అజ్ఞాని బీఆర్ నాయుడు

హైందవ ధర్మం.. ఆగమ శాస్త్రం తెలుసా..?

టీటీడీ చైర్మన్‌ను సూటిగా ప్రశ్నించిన భూమన

కరుణాకర్‌రెడ్డిని 4 గంటలపాటు విచారించిన పోలీసులు



విచారణ అనంతరం పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వస్తున్న భూమన కరుణాకర రెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ''అజ్ఞానుల్లో అజ్ఞాని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు. అలాంటి వ్యక్తులను చూసి భయపడను. మీకు ఆధ్యాత్మికత, హైందవ ధర్మం, ఆగమశాస్త్రం గురించి తెలియదు. తెలిసిందల్లా మిడ్‌నైట్ మసాలా గురించి మాత్రమే. బీఆర్ నాయుడుకు ఉన్న ఆధ్యాత్మిక జ్ఞానంపై ఆయన చానెల్ టీవీ-5లోనే నేను చర్చకు సిద్ధం'' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సవాల్ విసిరారు. అలిపిరి వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం స్థలంలో మలమూత్రాలు విసర్జించే చోట శ్రీమహావిష్ణు విగ్రహం నిర్లక్ష్యంగా పడవేసి ఉండడాన్ని ఇటీవల భూమన గమనించారు. ప్రత్యక్షంగా పరిశీలించి మీడియా సమావేశంలో టీటీడీ తీరుపై మండిపడ్డారు. అయితే, దీనిపై భూమన కరుణాకర్‌రెడ్డి మీద ఓ ఇంజనీర్ చేత కక్షపూరితంగా ఫిర్యాదు చేయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు... భూమనకు రెండ్రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ భక్తవత్సలం ఎదుట భూమన హాజరయ్యారు. నాలుగు గంటల పాటు విచారించిన పోలీసులు 31 ప్రశ్నలు వేశారు. వీటికి సమాధానం ఇచ్చినట్లు భూమన తెలిపారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడారు. బీఆర్ నాయుడు ఒత్తిడి మేరకు ఇంజనీర్‌తో ఫిర్యాదు చేయించి... హైందవ ధర్మం, మత విద్వేషాలు రెచ్చగొట్టానని తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. విగ్రహ ఘటనలో తప్పిదాలుంటే టీటీడీలో అత్యున్నత అధికారి ఈవో ఫిర్యాదు చేయాలి కానీ, ఇంజనీర్‌తో ఫిర్యాదు విడ్డూరమని పేర్కొన్నారు. మహా విష్ణువు విగ్రహాన్ని శనీశ్వరుడి విగ్రహం అనడం మహా పాపమని మండిపడ్డారు. టీటీడీ స్థలంలో శంఖుచక్రాలు ధరించిన విగ్రహం పడి ఉందనే విషయం తన దృష్టికి రాగా, అది ఘోరమైన తప్పిదంగా భావించానన్నారు. ఇది ఎలా హైందవ ద్రోహమో బీఆర్ నాయుడుకు మాత్రమే తెలుసని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక శనీశ్వరుడు దేవతామూర్తి కాదా..? అంటూ ప్రశ్నించారు. శని దేవుడికి శంఖుచక్రాలు ఉండవని వెల్లడించారు. ఈ విషయంలో ఎల్లో మీడియా విష ప్రచారం చేస్తోందన్నారు. ''నాపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టాలని ఆలోచన చేస్తున్నారు. నేను కేసులకు భయపడే, బెదిరే వ్యక్తిని కాను. ఏ తప్పు చేయలేదు. చేయను. ఎన్నిసార్లు పిలిచినా పోలీసు విచారణకు వస్తా'' అని భూమన తేల్చి చెప్పారు. అనంతరం తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి టీటీడీ చేస్తున్న తప్పులను భూమన ఎత్తి చూపిస్తున్నారని, సరిచేసుకోవాల్సింది పోయి... బీఆర్ నాయుడు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని అన్నారు. తొక్కిసలాట, గోశాల ఘటనను ప్రజలు గమనించారని పేర్కొన్నారు. భూమన సవాల్‌ను స్వీకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ, ఎండగడుతూనే ఉంటామని ఎంపీ స్పష్టం చేశారు.

'సాక్షి'పై ప్రభుత్వ కక్ష సాధింపు తగదు

పత్రికా స్వేచ్ఛను హరించొద్దు

- సీఎం చంద్రబాబుకు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా లేఖ
- కేవలం 'సాక్షి'నే లక్ష్యంగా చేసుకుని కేసులు పెట్టడంపై తీవ్ర ఆందోళన
- ఇది అధికార దుర్వినియోగమేనని స్పష్టీకరణ
- విలేకరుల సమావేశాన్ని ప్రచురించినందుకు వేధించడం దారుణం
- పత్రికల గొంతు నొక్కే చర్యలను తక్షణమే ఆపాలని డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడి, ప్రత్యేకించి 'సాక్షి' మీడియా సంస్థను లక్ష్యంగా చేసుకుని చంద్రబాబు ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులపై జాతీయ స్థాయిలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏపీలో 'సాక్షి' మీడియా సంస్థతోపాటు జర్నలిస్టుల పట్ల పోలీసుల వ్యవహారశైలిపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఈజీఐ) తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు శుక్రవారం ఎడిటర్స్ గిల్డ్ ఒక లేఖ రాసింది. 'సాక్షి'పై కక్ష సాధింపు చర్యలను తక్షణమే నిలిపివేయాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడు అనంత్ నాథ్, ప్రధాన కార్యదర్శి రూబెన్ బెనర్జీ, కోశాధికారి కె.వి. ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఒక్క పత్రికపైనే ఎందుకు?

ఒక రాజకీయ నాయకుడు నిర్వహించిన విలేకరుల సమావేశాన్ని ప్రచురించినందుకు ఇతర మీడియా సంస్థలను వదిలిపెట్టి, కేవలం 'సాక్షి'పై మాత్రమే క్రిమినల్ కేసు నమోదు చేయడాన్ని ఎడిటర్స్ గిల్డ్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇది పక్షపాత వైఖరికి నిదర్శనమని, నేర చట్టాలను ఎంపిక చేసుకుని ప్రయోగించడం పోలీసుల అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని పేర్కొంది. ఇది సాధారణ జర్నలిజంలో భాగమే అయినప్పటికీ, 'సాక్షి'ని మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం వెనుక ప్రభుత్వ కుట్ర స్పష్టంగా కనిపిస్తోందని అభిప్రాయపడింది.

వేధింపులు ఆపండి

పత్రికలను అనవసరమైన, కక్ష సాధింపు ఫిర్యాదులతో వేధించకూడదని ఎడిటర్స్ గిల్డ్ హితవు పలికింది. పోలీసుల ప్రవర్తన నిష్పక్షపాతంగా, వృత్తిపరంగా ఉండాలని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసే సంస్థలను భయపెట్టేలా ఉండకూడదని స్పష్టంచేసింది. ప్రజా ప్రయోజనాల కోసం పనిచేస్తున్న జర్నలిస్టులను అణచివేయడానికి, భయపెట్టడానికి క్రిమినల్ చట్టాలను ఆయుధాలుగా వాడటం రాజ్యాంగ విరుద్ధమని తెలిపింది. తక్షణమే ముఖ్యమంత్రి కార్యాలయం జోక్యం చేసుకుని, రాష్ట్రంలో పత్రికలు నిర్భయంగా విధులను నిర్వర్తించే వాతావరణాన్ని కల్పించాలని ఎడిటర్స్ గిల్డ్ డిమాండ్ చేసింది.

సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై అక్రమ కేసులు పత్రికా స్వేచ్ఛపై దాడే: ఐజేయూ

'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డి, పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛపై దాడే అని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) తీవ్రంగా విమర్శించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులతోనే సాక్షి దినపత్రిక, పాత్రికేయులను వేధిస్తోందని ఐజేయూ ప్రధాన కార్యదర్శి బల్విందర్‌సింగ్ జమ్ము శుక్రవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు ఇటీవల తనిఖీలు చేయడం, ఆయనకు నోటీసులు జారీ చేయడం పత్రికా స్వేచ్ఛపై ముప్పేట దాడి చేయడమేనని ఆయన దుయ్యబట్టారు. సాక్షి ఎడిటర్, పాత్రికేయులను భయపెట్టేందుకే పోలీసులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పత్రికలను నియంత్రించాలని ఏ ప్రభుత్వం భావించకూడదన్నారు. పత్రికల్లో ప్రచురితమైన వార్తలు, కథనాలపై అభ్యంతరం ఉంటే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని బల్విందర్‌సింగ్ స్పష్టంచేశారు. కానీ, పత్రికలపై అక్రమ కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి చర్యలను ఐజేయూ ఏమాత్రం ఆమోదించదని స్పష్టంచేశారు.